
సాక్షి
కాకినాడ
శనివారం । 1 । జూలై । 2023



డెల్టాలకు 7,660 క్యూసెక్కులు

ధవళేశ్వరం: బ్యారేజీ నుంచి శుక్రవారం 7,660 క్యూసెక్కుల గోదావరి జలాలు వదిలారు. తూర్పు 2,130, సెంట్రల్ 1,530, పశ్చిమ డెల్టాకు 4 వేల క్యూసెక్కులు విడుదల చేశారు.



చేయందించమంది ఒక ప్రాణం

దేవుడు ప్రాణాలు పోస్తే.. వైద్యులు ప్రాణాలను కాపాడతారు. అందుకే వైద్యో నారాయణో హరిః అన్నారు పెద్దలు. నేడు డాక్టర్స్ డే సందర్భంగా ప్రత్యేక కథనం - IIలో ▸

గరిష్ఠం/కనిష్ఠం
41.0° / 27.5°

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమహేంద్రవరం	41.0	27.5
కాకినాడ	36.9	28.2
అమలాపురం	38.0	27.5

న్యూస్‌రీల్

ప్రభుత్వ ప్రాధాన్య అంశాలపై దృష్టి పెట్టాలి

కాకినాడ సిటీ: ప్రభుత్వ ప్రాధాన్య అంశాలైన విద్య, వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలో వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు సక్రమంగా అమలయ్యే విధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి అమరావతి నుంచి జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో కలెక్టరేట్ నుంచి కలెక్టర్, జేసీ పాల్గొన్నారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడు, రెండో దశ మన బడి నాడు–నేడు పనులపై ప్రత్యేక దృష్టి పెట్టి సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. గర్భిణుల్లో రక్తహీనతను నివారించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ సక్రమంగా అమలయ్యేలా పర్యవేక్షించాలని చెప్పారు. విద్య, వైద్యం, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు కృషి చేయాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ఆర్.రమేష్, విద్యా శాఖాధికారి కేఎస్‌వీఎస్ అన్నపూర్ణ, జెడ్పీ సీఈఓ ఎ.రమణారెడ్డి, సీపీఓ పి.త్రినాథ్, పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాస్, గ్రామీణ నీటి సరఫరా ఎస్ఈలు ఎస్.శ్రీనివాస్, కాకినాడ, పెద్దాపురం డీఎల్‌డీఓలు నారాయణమూర్తి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు ఉన్నత విద్యా ప్రణాళిక బోర్డు సమావేశాలు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా ప్రణాళిక బోర్డు ఐదో సమావేశాలు జేఎన్‌టీయూకేలో శని, ఆదివారాల్లో నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆధ్వర్యాన జరుగుతున్న ఈ సమావేశాల్లో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ చైర్మన్ ప్రొఫెసర్ ఎం.జగదీష్‌కుమార్ పాల్గొని, ఉన్నత విద్యలో బోధనాపరమైన మార్పులను వివరిస్తారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ కె.హేమచంద్రారెడ్డి, రాష్ట్రంలో ఉన్న వివిధ యూనివర్సిటీల ఉప కులపతులు ఈ సమావేశంలో పాల్గొంటారు.

ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక స్పందనకు 31 అర్జీలు



మహిళల సమస్య తెలుసుకుంటున్న జేసీ ఇలక్కియ

కాకినాడ సిటీ: కలెక్టరేట్ స్పందన హాలులో ఎస్సీ, ఎస్సీ ప్రత్యేక స్పందన శుక్రవారం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, జిల్లా రెవెన్యూ అధికారి కె.శ్రీధర్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ ఎ.రమణారెడ్డి కలిసి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 31 అర్జీలు స్వీకరించారు. వాటిని ఆయా శాఖల అధికారులకు పంపించి నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. భూ సమస్యలు, రెవెన్యూ సేవలు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, పెన్షన్ తదితర అంశాలపై ప్రజలు అర్జీలు సమర్పించారు.

3న జాబ్‌మేళా

కాకినాడ సిటీ: తమ కార్యాలయంలో ఈ నెల 3న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు శుక్రవారం తెలిపారు. టీవీఎస్ ఫైనాన్స్‌లో స్టోర్ సేల్స్ ఆఫీసర్, యాక్సిస్ బ్యాంక్‌లో బీడీఈ, సేల్స్ ఆఫీసర్ అండ్ అసిస్టెంట్ మేనేజర్; హోమ్ కంఫర్ట్స్ ఫర్నిచర్ షోరూమ్‌లో అకౌంట్స్ మేనేజర్, అసిస్టెంట్ స్టాక్ సూపర్‌వైజర్, అసిస్టెంట్ సేల్స్ ఎగ్జిక్యూటివ్ అండ్ టెక్నీషియన్; నిట్ (ఐసీఐసీఐ) బ్యాంక్‌లో రిలేషన్‌షిప్ మేనేజర్; డెక్కన్ కెమికల్స్‌లో ట్రైనీ; ఇసుజు మోటార్స్, డిక్సాస్ కంపెనీల్లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ ఉద్యోగాలకు పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన 35 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులన్నారు. ఆయా ఉద్యోగాలను బట్టి వీరికి నెలకు రూ.12 వేల నుంచి రూ.25 వేల వరకూ జీతం, ఇన్సెంటివ్‌లు, భోజనం, వసతి, రవాణా సౌకర్యాలు ఉంటాయని తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్న వారు సోమవారం ఉదయం 9 గంటలకు కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయానికి సర్టిఫికెట్ల జిరాక్సులతో హాజరు కావాలని లచ్చారావు సూచించారు. అలాగే, డీడీయూజీకేవై స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ద్వారా శిక్షణ ఇచ్చి, ఉద్యోగాలు కల్పిస్తామని తెలిపారు.

రూ.లక్ష విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో శాశ్వత సుదర్శన హోమానికి ఇళయ రాజగోపాల్, శ్రీహర్ష దంపతులు (విజయనగరం) శుక్రవారం రూ.లక్ష విరాళం సమర్పించారు. ఆలయంలో అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణకు అందజేసి స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందుకున్నారు.

పంట చేనులో రుణానందలహరి



- స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచిన రాష్ట్ర ప్రభుత్వం
- డీసీసీబీ నుంచి గత ఏడాది ఖరీఫ్‌లో రూ.502 కోట్ల పంట రుణాలు
- ఈ ఏడాది రూ.895 కోట్లకు పెంపు
- రైతుల సాగు పెట్టుబడులకు తప్పనున్న ఇబ్బందులు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: రైస్ బౌల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌గా పిలిచే ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఖరీఫ్ పెట్టుబడికి రైతులకు అయ్యే ప్రతి పైసాకూ రాష్ట్ర ప్రభుత్వం భరోసా కల్పిస్తోంది. ఇందులో భాగంగా ఖరీఫ్‌లో రుణపరపతి కల్పించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేసింది. ఈ మేరకు ఉమ్మడి జిల్లా రైతుల కోసం రూపొందించిన ఖరీఫ్ రుణ ప్రణాళికకు రాష్ట్ర స్థాయి సాంకేతిక కమిటీ ఇటీవలే గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఖరీఫ్‌కు సంబంధించి మే నుంచి సెప్టెంబర్, రబీలో అక్టోబర్ నుంచి మార్చి వరకూ సహకార సంఘాల ద్వారా రుణాలిస్తారు.

ప్రస్తుతం వరుణుడు ముఖం చాటేయడంతో అటు మెట్ట, ఇటు డెల్టా ఆయకట్టులో వరి నాట్లు కొంత ఆలస్యమవుతున్నాయి. నాట్లు ఎప్పుడు ప్రారంభించినా పెట్టుబడికి రైతులు ఇబ్బంది పడకూడదనే ముందుచూపుతో ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ) ముందస్తు ఏర్పాట్లు చేసింది. పరపతి కోసం వడ్డీ వ్యాపారులు, ధాన్యం కమీషన్ ఏజెంట్ల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేకుండా చర్యలు తీసుకుంది.

కాకినాడలోని డీసీసీబీ ఉమ్మడి జిల్లాలోని ప్రతి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) పరిధిలో నిర్దేశించిన పరపతి అందజేయనుంది. రైతులకు రుణాలివ్వడంలో వాణిజ్య బ్యాంకులు కూడా పోటీ పడుతున్నా.. పీఏసీఎస్‌ల స్థాయిని మాత్రం అవి అందుకోలేకపోతున్నాయి. 90 శాతం మంది రైతులు పీఏసీఎస్‌ల ద్వారానే రుణాలు పొందుతున్నారు. పంట రుణాలపై వడ్డీ 7 శాతం ఉండటం, తీసుకున్న రుణాన్ని ఏడాది లోపు చెల్లించేసి, తిరిగి రుణం పొందే అవకాశం ఉండటంతో రైతులు ఎక్కువగా పీఏసీఎస్‌ల వైపే మొగ్గు చూపుతున్నారు.

జిల్లాల వారీగా సాగు విస్తీర్ణం, రైతుల వివరాలు

జిల్లా	సాగు విస్తీర్ణం (ఎకరాలు)	రైతులు
కాకినాడ	1,96,000	1,65,000
కోనసీమ	1,83,000	1,10,000
తూర్పు గోదావరి	1,95,396	1,25,000

30 శాతం అధికంగా..

ఈ నేపథ్యంలో పెరుగుతున్న వ్యవసాయ పెట్టుబడులకు అనుగుణంగా రుణపరిమితి పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే నిర్ణయం తీసుకుంది. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో బ్యాంకర్లు కూడా రైతులకు అధికంగా రుణాలు అందించేందుకు ముందుకు వచ్చారు. గత ఏడాది ఖరీఫ్‌తో పోల్చితే ఈ ఏడాది వరితో పాటు ఉద్యాన, ఆక్వా రంగాలకు రుణ పరపతిని ఎకరాకు అదనంగా రూ.10 వేలకు పెంచుతూ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ నిర్ణయం తీసుకొంది. ఉమ్మడి జిల్లాలో గత ఏడాది వరి రైతుకు ఎకరాకు రూ.38 వేల వరకూ రుణ పరపతి కల్పించారు. దీనిని ఈసారి రూ.45 వేలకు పెంచారు. ఈసారి 20 నుంచి 30 శాతం అధికంగా పరపతి కల్పించనుండటంతో ఖరీఫ్ పెట్టుబడులకు ఇబ్బందులు తప్పుతాయని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రూ.393 కోట్లు పైనే అదనపు పరపతి

ఈ ఖరీఫ్‌లో రూ.895 కోట్ల మేర పంట రుణాలు ఇవ్వాలని డీసీసీబీ ప్రణాళిక సిద్ధం చేసింది. గత ఏడాది ఇదే సీజన్‌లో రూ.502 కోట్లు మాత్రమే రుణాలివ్వగా, ఈసారి అదనంగా రూ.393 కోట్లు అదనంగా రుణ పరపతి కల్పిస్తోంది. రైతులు అత్యధికంగా సాగు చేసే వరితో పాటు ఉద్యాన పంటలకు కూడా రుణ పరిమితి పెంచడంతో రుణ ప్రణాళిక కూడా పెరిగింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 50 డీసీసీబీ బ్రాంచిలు, 296 పీఏసీఎస్‌ల ద్వారా ప్రతి రైతుకూ రుణం అందించడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు.

దీర్ఘకాలిక రుణాల్లోనూ పెరుగుదల

డీసీసీబీ రూపొందించుకున్న దీర్ఘకాలిక రుణ ప్రణాళికలో కూడా పెరుగుదల కనిపిస్తోంది. గత ఖరీఫ్‌లో 45 వేల మంది రైతులకు రూ.326 కోట్ల మేర దీర్ఘకాలిక రుణాలు అందించారు. ఈ సీజన్‌లో రూ.375 కోట్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గత ఖరీఫ్‌లో స్వల్పకాలిక రుణాలు కాకుండా ఇతర రుణాలు రూ.1,015 కోట్లు ఇవ్వాలని లక్ష్యం పెట్టుకోగా, రూ.725 కోట్లు అందజేశారు. ఈసారి కూడా అదే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు.

రైతు ఇంటికే వెళ్లి రుణాలు



ఖరీఫ్ పంట రుణాలతో పాటు, రైతులకు దీర్ఘకాలిక రుణాలు, వారి పిల్లలకు విద్యారుణాలు, బంగారు నగలపై కూడా రుణాలు ఇస్తున్నాం. వాణిజ్య బ్యాంకుల కంటే తక్కువ వడ్డీకే అన్ని రకాల రుణాలూ అందిస్తున్నాం. రైతులు తమ అవసరాలకు రుణం కోసం సహకార సంఘాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా రైతు ఇంటికే వెళ్లి సహకార శాఖ సిబ్బంది రుణాలు అందిస్తున్నారు.

– ఆర్‌వీ నరసింహారావు, సీఈఓ, డీసీసీబీ, కాకినాడ

బెడద తప్పుతుంది



గతంలో పంట వేయాలంటే ప్రైవేటు అప్పుల కోసం ఎక్కే గుమ్మం దిగే గుమ్మం అన్నట్టు ఉండేది. ఇప్పుడు ప్రభుత్వం ముందుగానే సొసైటీల ద్వారా రుణాలివ్వడానికి ఏర్పాట్లు చేస్తూండటం సంతోషాన్నిస్తోంది. దీంతో అధిక వడ్డీలకు అప్పులు తీసుకోవాల్సిన బెడద తప్పుతుంది. గతంలో మాదిరిగానే ఈ ఖరీఫ్ సీజన్‌లో కూడా రుణాలిస్తామని అధికారులు చెబుతున్నారు. వాటి కోసం ఎదురు చూస్తున్నాం.

– అప్పారి చిన్న వెంకట రమణ, రైతు, నల్లమిల్లి, అమలాపురం రూరల్

జగనన్న ఆణిముత్యానికి కలెక్టర్ చేయూత



కలెక్టర్ కృతికా శుక్లాకు ధన్యవాదాలు తెలుపుతున్న అక్షయ, తండ్రి సత్యనారాయణ

కాకినాడ సిటీ: 'జగనన్న ఆణిముత్యం'గా నిలిచిన ఓ విద్యార్థినికి కలెక్టర్ కృతికా శుక్లా కొండంత అండగా నిలిచారు. ఉన్నత చదువులకు పేదరికం అడ్డంకిగా ఉందని, సాయం చేయాలంటూ అభ్యర్థించిందే తడవుగా సత్వరం సాయం అందించారు. వివరాలివీ.. జగ్గంపేట మండలం రాజపూడి గ్రామానికి చెందిన నంగన అక్షయ స్థానిక ఉన్నత పాఠశాలలో చదవి, పదో తరగతి పరీక్షల్లో 600కు 585 మార్కులతో నియోజకవర్గ స్థాయిలో మొదటి ర్యాంకు కైవసం చేసుకుంది. జిల్లా స్థాయిలో మూడో స్థానంలో నిలిచింది. మట్టిలో మాణిక్యాలకు తగిన గుర్తింపు ఇవ్వాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమం ద్వారా ప్రతిభా పురస్కారం అందుకుంది. ఐఐటీలో చేరాలనే లక్ష్యంతో ఇంటర్మీడియెట్‌లో చేరేందుకు టాలెంట్ టెస్ట్ రాసి, ఓ కార్పొరేట్ జూనియర్ కళాశాలలో ప్రవేశం పొందింది. అయితే రెండేళ్లకు కలిపి రూ.3.20 లక్షలు అవుతుందని ఆ కళాశాల యాజమాన్యం చెప్పింది. అక్షయ తండ్రి రైస్ మిల్లులో గుమస్తాగా, తల్లి అంగన్‌వాడీ కార్యకర్తగా పని చేస్తున్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితుల రీత్యా కుమార్తె చదువుకు అంత పెట్టుబడి పెట్టే స్తోమత వారికి లేకపోయింది. దీంతో అక్షయ తండ్రి సత్యనారాయణ కలెక్టర్ కృతికా శుక్లాను ఆశ్రయించారు. చదువుల తల్లిగా ఉన్న తన కుమార్తె కలను సాకారం చేసేందుకు సాయం చేయాలని వేడుకున్నారు. ఆయన విజ్ఞప్తిపై కలెక్టర్ తక్షణం స్పందించారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ కార్పొరేట్ సామాజిక బాధ్యత ద్వారా అక్షయను ఆ కళాశాలలో చేర్పించారు. హాస్టల్ ఫీజు సహా రెండేళ్ల పాటు ఉచితంగా చదువుకునేలా ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో అక్షయ, ఆమె తండ్రి సత్యనారాయణ కలెక్టర్ కృతికా శుక్లాను శుక్రవారం కలెక్టరేట్‌లో కలిసి ధన్యవాదాలు తెలిపారు. అక్షయకు కలెక్టర్ అభినందనలు తెలిపి, బాగా చదివి ఐఐటీ కలను సాకారం చేసుకోవాలని, మున్ముందు ఏ సహాయం కావాలన్నా అందిస్తానని భరోసా ఇచ్చారు.

శాశ్వతంగా రెడ్ సిగ్నల్

- నేటి నుంచి హంసవరం, రావికంపాడు రైల్వే స్టేషన్లు కనుమరుగు
- ప్రయాణికులు లేకపోవడంతో మూసివేతకు నిర్ణయం



కనుమరుగు కానున్న హంసవరం రైల్వే స్టేషన్



రావికంపాడు రైల్వే స్టేషన్

అన్నవరం: జిల్లాలోని రెండు స్టేషన్లకు రైల్వే శాఖ శాశ్వతంగా రెడ్ సిగ్నల్ వేసేసింది. అన్నవరానికి సమీపాన చిరకాలం నుంచి ఉన్న హంసవరం, రావికంపాడు రైల్వే స్టేషన్లను శనివారం నుంచి మూసివేయాలని నిర్ణయించింది. రోజుకు 25 మంది కూడా ప్రయాణించని స్టేషన్లను మూసివేయాలన్న అధికారుల నిర్ణయం మేరకు ఈ స్టేషన్లను మూసివేస్తున్నారు. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అటు విజయవాడ.. ఇటు విశాఖపట్నం వైపు ప్రయాణించేందుకు ఈ రెండు స్టేషన్లూ ఎంతో ఉపయోగపడేవి.

వందేళ్లకు పైగా చరిత్ర

తుని మండలంలోని హంసవరం రైల్వే స్టేషన్‌కు వందేళ్లకు పైగా చరిత్ర ఉంది. బ్రిటిష్ వారి హయాంలో విజయవాడ – కటక్ నగరాల నడుమ ప్రయాణాలకు వీలుగా ఈస్ట్‌కోస్ట్ స్టేట్ రైల్వే ఆధ్వర్యాన 1893–96 సంవత్సరాల మధ్య ఈ స్టేషన్ నిర్మించారు. నాలుగేళ్ల క్రితం వరకూ ఇక్కడ ఆరు ప్యాసింజర్ రైళ్లు ఆగేవి. హంసవరం, దాని చుట్టుపక్కల పది గ్రామాల ప్రజలు తుని, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, విజయవాడ తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు ఈ స్టేషన్ ఎంతో అనువుగా ఉండేది. తక్కువ ఖర్చుతో ప్రయాణించే వెసులుబాటు ఉండేది. క్రమంగా ఈ గ్రామాలకు రోడ్డు సదుపాయాలు మెరుగవడంతో ఇక్కడి నుంచి రైళ్ల ద్వారా ప్రయాణించే వారు తగ్గిపోయారు. దీనికి తోడు కరోనా కారణంగా 2020, 21 సంవత్సరాల్లో పలు రైళ్లను రైల్వే శాఖ నిలిపివేసింది. దీంతో ఈ స్టేషన్ వెలవెలబోయింది. కరోనా అనంతరం రైళ్ల రాకపోకలను పునరుద్ధరించినా ప్యాసింజర్ రైళ్లను ఎక్స్‌ప్రెస్‌లుగా మార్చడంతో ఇక్కడ ఒక్క రైలు కూడా ఆగడం లేదు. చివరకు ప్రయాణికులు లేరన్న కారణంతో రైల్వే అధికారులు ఈ స్టేషన్‌ను శాశ్వతంగా మూసివేశారు.

రూ.కోట్ల ఆదాయం వస్తున్నా..

అన్నవరానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న రావికంపాడు గ్రామం తొండంగి మండలం పరిధిలోకి వస్తుంది. ఇక్కడి రైల్వే స్టేషన్‌ను కూడా నేటి నుంచి మూసివేస్తున్నారు. దీంతో ఇన్నేళ్లుగా ఈ స్టేషన్‌తో ఆ గ్రామస్తులకున్న అనుబంధానికి తెర పడుతోంది. ఈ మార్గంలో ప్రయాణించే రైళ్లను ఆ గ్రామస్తులు చూడటం తప్ప ఆగే రైలు వారికి ఇక కనిపించదు. ఈ స్టేషన్ ద్వారా ప్రతి రోజూ వందలాది ట్రక్కుల ద్వారా గ్రావెల్ ఎగుమతి అవుతోంది. తద్వారా రైల్వేకు రూ.కోట్ల ఆదాయం వస్తోంది. అయినప్పటికీ ప్రయాణికులు లేరన్న కారణంతో ఈ రైల్వే స్టేషన్‌ను మూసివేస్తున్నారు. ఇప్పటి వరకూ ఈ రెండు రైల్వే స్టేషన్ల నుంచి ప్రయాణిస్తున్న వారు ఇక నుంచి అన్నవరం స్టేషన్‌లో రైళ్లు ఎక్కి రాకపోకలు సాగించాల్సి ఉంటుంది.

హనీకి పాఠశాలలో ఉచితంగా ప్రవేశం



పాప హనీకి అక్షరాభ్యాసం చేస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం రూరల్: అరుదైన వ్యాధితో బాధ పడుతున్న అల్లవరం మండలం నక్కా రామేశ్వరం గ్రామానికి చెందిన కొప్పాడి రాంబాబు, నాగలక్ష్మి దంపతుల కుమార్తె హనీ చదువుపై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఆ చిన్నారికి కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో శుక్రవారం అక్షరాభ్యాసం చేయించారు. కామనగరువులోని ఢిల్లీ పబ్లిక్ స్కూలులో ఉచితంగా ప్రవేశం కల్పించారు. కార్యక్రమంలో పాప తల్లిదండ్రులు కొప్పాడి రాంబాబు నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. హనీ అనారోగ్య సమస్యను తెలుసుకున్న సీఎం జగన్ మోహన్‌రెడ్డి గత ఏడాది అక్టోబర్‌లో రూ.కోటి మంజూరు చేశారు.

పోలీసులు ప్రజలకు చేరువయ్యేలా 'వారధి'



వారధి కార్యక్రమంలో మహిళలతో మాట్లాడుతున్న ఎస్పీ సతీష్‌కుమార్

- జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్
- వలసపాకల గ్రామంలో నిర్వహణ

కాకినాడ రూరల్: పోలీసులు ప్రజలకు చేరువయ్యేందుకు వినూత్నంగా 'వారధి' కార్యక్రమం నిర్వహిస్తున్నామని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. మండలంలోని వలసపాకల సచివాలయం-2 వద్ద సర్పవరం సీఐ ఆకుల మురళీకృష్ణ ఆధ్వర్యాన శనివారం రాత్రి ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పోలీసు సేవలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించారు. అధిక సంఖ్యలో పాల్గొన్న మహిళల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అసాంఘిక కార్యకలాపాల నిరోధానికి పోలీసులతో స్నేహపూర్వంగా ఉండాలని, ఎవరైనా అనుమానితులు సంచరిస్తే తక్షణమే సమాచారం ఇవ్వాలని సూచించారు. ముఖ్యంగా మహిళలు, యువతులు, బాలికలపై ఎవరైనా వేధింపులకు పాల్పడితే దిశ యాప్ ద్వారా సమాచారం ఇవ్వడంతో పాటు ఫిర్యాదు చేయాలని సూచించారు. మహిళల రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని, ప్రతి ఒక్కరూ తమ స్మార్ట్ ఫోన్‌లో దిశ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని అన్నారు. సురక్షిత సమాజ నిర్మాణానికి వారధి కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని ఎస్పీ చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు శాఖ అమలు చేస్తున్న వివిధ సేవల వీడియోను స్క్రీన్‌పై ప్రదర్శించి అవగాహన కల్పించారు. శాంతిభద్రతలకు సంబంధించి మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై ముఖాముఖి నిర్వహించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (పరిపాలన) పి.శ్రీనివాస్, ఇన్‌చార్జి డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యుడు నురుకుర్తి రామకృష్ణ, ఎస్సై వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పరిశోధన కేంద్ర ఇన్‌చార్జి అధిపతిగా చలపతిరావు



అంబాజీపేట: అంబాజీపేట డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రం ఇన్‌చార్జి అధిపతిగా డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఉద్యాన పరిశోధన విశ్వవిద్యాలయం నుంచి శుక్రవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ బి.శ్రీనివాసులు ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా చలపతిరావు ఇన్‌చార్జి అధిపతిగా వ్యవహరించనున్నారు.

గంజాయి, మద్యం అక్రమ రవాణాపై నిఘా

అమలాపురం టౌన్: గంజాయి, మద్యం అక్రమ రవాణాపై మరింత నిఘాను విస్తృతం చేసి వాటి పూర్తి నివారణకు పోలీసులు మరింత శ్రమించాలని ఎస్పీ సుసరాపు శ్రీధర్ ఆదేశించారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం రాత్రి జరిగిన జిల్లా క్రైమ్ రివ్యూ మీటింగ్‌లో ఎస్పీ శ్రీధర్ నేరాల అదుపు, కేసుల ప్రగతిపై డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలతో సమీక్షించారు. పబ్లిక్ సేఫ్టీ యాక్ట్ ప్రకారం ప్రతీ వ్యాపార సంస్థ కచ్చితంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ శ్రీధర్ స్పష్టం చేశారు. సీసీ కెమెరాల్లో రికార్డింగ్ కనీసం 30 రోజులు ఉండే విధంగా వ్యాపారులు చర్యలు తీసుకునేలా వారిని కార్యోన్ముఖులను చేయాలని అధికారులను ఆదేశించారు. అందుకు అంగీకరించని వ్యాపారులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన జగనన్నకు చెబుదాం (జేకేసీ)లో వచ్చే ఫిర్యాదులపై సత్వరమే స్పందించి విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళలపై జరుగుతున్న నేరాల నియంత్రణకు దిశ యాప్ ఉపయోగాలు, యాప్ డౌన్ లోడ్ తదితర అంశాలపై ముఖ్యంగా మహిళా పోలీసులు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న తీవ్ర నేరాల్లో సాక్షులను సక్రమంగా కోర్టులకు హాజరు పరచి త్వరితగతిన విచారణ పూర్తి చేసి కోర్టుల ద్వారా నిందితులకు శిక్షలు పడేలా చూడాలని తెలిపారు. చోరీ కేసుల్లో నిందితులను అరెస్ట్ చేసి పోయిన సొమ్ములను చాకచక్యంగా, త్వరితగతిన రికవరీ చేసి కేసులను ఛేదించిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ శ్రీధర్ అభినందించి నగదు బహుమతులు అందజేశారు.

క్లుప్తంగా

23 కిలోల గంజాయితో వ్యక్తి అరెస్టు

తొండంగి: మండలంలోని బెండపూడి జాతీయ రహదారి తమ్మయ్యపేట శివారు రావికంపాడు జంక్షన్ వద్ద 23 కిలోల గంజాయితో యువకుడిని అరెస్టు చేసినట్టు తొండంగి ఎస్సై ఎస్.రవికుమార్ శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం తణుకుకు చెందిన యువకుడు ఇమ్మండు సాయి మధుసూధన్ మరో వ్యక్తితో కలిసి గంజాయి మూటతో నిలుచుండగా ఎస్సై రవికుమార్, తన సిబ్బందితో వెళ్లి దాడి చేసి పట్టుకున్నారు. ఇద్దరిలో ఒకరు పరారీలో ఉండగా సాయి మధుసూదన్‌ను అదుపులోకి తీసుకుని 23 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన వివరించారు.

గాడిలంకలో అగ్ని ప్రమాదం

– రూ.15 లక్షల ఆస్తి నష్టం

ముమ్మిడివరం: మండలంలోని గాడిలంకలో గురువారం ఆక్వా చెరువుల వద్ద గల షెడ్డులో అగ్ని ప్రమాదం జరిగి రూ.15లక్షల ఆస్తి నష్టం సంభవించింది. గుత్తుల సాయి శ్రీనివాసరావుకు చెందిన ఆక్వా చెరువుల వద్ద ఉన్న షెడ్డులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం చోటు చేసుకుంది. షెడ్డులో ఉన్న జనరేటర్, ఆక్వాఫీడ్ బస్తాలు, వలలు, ఇతర పరికరాలు అగ్నికి ఆహుతి అయ్యాయి. ముమ్మిడివరం అగ్నిమాపక అధికారి కొండబాబు అధ్వర్యంలో సిబ్బంది మంటలను ఆర్పి వేశారు.

చదరంగం జాతీయ పోటీలకు సాయివిభు



ప్రకాశం నగర్: విజయనగరంలో గత 28 నుంచి 30 వరకూ జరిగిన అండర్ 7 రాష్ట్రస్థాయి చదరంగం పోటీల్లో నగరానికి చెందిన సాయివిభు సత్తా చాటి జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ విషయాన్ని జిల్లా చదరంగం సంఘం కార్యదర్శి జీవీ కుమార్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. పశ్చిమబంగాల్లో సెప్టెంబర్ 20 నుంచి జరిగే జాతీయ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి సాయివిభు ప్రాతినిధ్యం వహిస్తాడన్నారు.

చేయందించమంది ఒక ప్రాణం



- వృత్తి ధర్మంలో సంతృప్తి
- సేవా తత్పరతతో జిల్లా వైద్యులు
- నేడు డాక్టర్స్ డే

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): దేవుడు ప్రాణాలు పోస్తే.. వైద్యులు ప్రాణాలను కాపాడతారు. అందుకే వైద్యో నారాయణో హరి అన్నారు పెద్దలు. సమాజంలో వైద్య వృత్తికి ఉన్న గౌరవం, ప్రజల ఆరోగ్య సంరక్షణలో వారి భాగస్వామ్యం, వారి సేవలు అమూల్యమైనవి. వైద్యుడు లేని సమాజాన్ని ఊహించడమే కష్టం. ఎన్నో కష్టనష్టాలు ఉన్నా పవిత్రమైన వైద్యవృత్తిని దశాబ్దాలుగా కొనసాగిస్తూ ప్రజల సేవలో సంతృప్తి చెందుతున్న వైద్యులు జిల్లాలో ఎంతోమంది ఉన్నారు. వృత్తి ధర్మం పాటించడంతో పాటు పేద ప్రజలకు ఉచిత వైద్యసహాయాన్ని అందిస్తూ ప్రజల మనసుల్లో సుస్థిర స్థానం సంపాదించుకుంటున్నారు. నేడు డాక్టర్స్ డే సందర్భంగా ప్రత్యేక కథనం..

ప్రాణాలను సైతం పణంగా పెట్టి

కరోనా కష్టకాలంలో ఎంతోమంది వైద్యులు తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి రోగులకు సేవలందించారు. క్లిష్ట పరిస్థితుల్లో ఆసుపత్రికి వచ్చిన ఎంతోమంది రోగులకు మెరుగైన వైద్యం అందించి ప్రాణభిక్ష ప్రసాదించిన ఘనత జిల్లాలో వైద్యులది.

తమ సంపాదనను కూడా పక్కన పెట్టి ప్రభుత్వం అందిస్తున్న వైద్యసేవలకు ప్రభుత్వ వైద్యులకు బాసటగా నిలిచి తమ ఉదారతను చాటుకున్న ప్రయివేటు వైద్యులు ఎందరో ఉన్నారు.

ఎన్నో క్లిష్టతరమైన చికిత్సలు జిల్లాలోనే

గతంలో సాధారణ వ్యాధులకు మాత్రమే జిల్లాలో వైద్యులు అందుబాటులో ఉండేవారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్యులు అందుబాటులో ఉండేవారు కాదు. ప్రస్తుతం శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వైద్యసేవలు పెరిగాయి. గ్రామీణ ప్రాంతాల్లో సైతం స్పెషలిస్టులు అందుబాటులో ఉంటూ ఆధునిక వైద్య సదుపాయాలతో ఆసుపత్రులు ఏర్పాటు చేస్తున్నారు. క్లిష్టతరమైన శస్త్రచికిత్సలు సైతం ఇక్కడే విజయవంతంగా నిర్వహిస్తూ, నాణ్యమైన వైద్యం అందిస్తూ మెట్రో నగరాలతో సమానంగా సేవలందిస్తున్నారు.

సేవల్లో ముందుంటూ. .

జిల్లాలో వైద్యులు తమ సేవా దృక్పథాన్ని, పేదల పట్ల తమ నిబద్ధతను చాటుకుంటూ ఎన్నో స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రముఖ వైద్యులు సైతం తమ సంపాదన పక్కన పెట్టి వారంలో ఒకరోజు సత్యసాయి చారిటబుల్ ట్రస్ట్, రామకృష్ణమఠం ఇతర సేవా సంస్థలు నిర్వహించే వైద్య శిబిరాల్లో పాల్గొని పేద రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు. కొందరు వైద్యులు తమ ఆసుపత్రిలోనే వారంలో ఒకరోజు ఉచిత వైద్యం అందిస్తూ మన్ననలను పొందుతున్నారు.

18 వందల మంది నిరంతరం రోగుల సేవలో

తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 8,00 మంది వైద్యులు అందుబాటులో ఉంటే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 18 వందల మంది వైద్యులు ఉన్నారు. ఒక్క తూర్పుగోదావరి జిల్లాలో 450 ఆసుపత్రులు ఉండగా అందులో పనిచేసే వైద్యులు నిరంతరం రోగులు సేవలో ఉంటున్నారు. వాటితో పాటు ప్రభుత్వం ఆధ్వర్యంలో టీచింగ్ ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రులు, ట్రామాకేర్ సెంటర్లు, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్లలో వైద్యులు అందించే సేవలు మరువలేనివి.



డాక్టర్ అవ్వాలని కలగన్నాను



డాక్టర్ అవ్వాలని కలగన్నాను. అందుకు అనుగుణంగా. ఎంబీబీఎస్‌లో ఫ్రీ సీటు సాధించాను. డాక్టర్ అయిన రెండు నెలలకే ప్రభుత్వ డాక్టర్‌గా పనిచేసే అవకాశం లభించింది. రూరల్ పీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసర్‌గా ప్రస్థానం ప్రారంభించగా నేడు ప్రతిష్టాత్మక ఆరోగ్యశ్రీ పథకానికి జిల్లా కోఆర్డినేటర్‌గా పనిచేసే అదృష్టం లభించింది. చాలామంది పేదలకు ఉచితంగా వైద్యం అందించాలన్న నా ఆలోచన సాకారం అయ్యింది. నలుగురికి ఉపయోగపడే అవకాశం ఆరోగ్యశ్రీలో దక్కింది. ఆరోగ్యశ్రీ పథకం పారదర్శకంగా అమలు అయ్యేందుకు నా వంతు కృషి చేస్తున్నా.

– డాక్టర్ పి.ప్రియాంక, జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్

ప్రాణం నిలబెట్టడానికి నిద్రలేని రాత్రులెన్నో గడిపా



ఒక ప్రాణం నిలబెట్టడానికి నిద్రలేని రాత్రులు గడిపిన రోజులెన్నో ఉన్నాయి. డ్యూటీ ముగించుకుని ఆసుపత్రి నుంచి ఇంటికి వెళ్తున్న సమయంలో సడన్ హార్ట్ టాక్‌తో వస్తే 100 షాక్‌లు ఇచ్చి తెల్లవారు జాము మూడింటి వరకు ప్రయత్నం చేసి రోగిని కాపాడిన సందర్భం ఉంది. అయితే ఒకతను ఇంత కష్టపడ్డారు ఎంత తీసుకుంటారు అని అడిగాడు. రోగి హార్ట్ టాక్‌తో చనిపోయేందుకు కొన్ని క్షణాలే ఉన్నాయి, ఆ సమయంలో ఈ ప్రశ్న అడిగుంటే రోగి బతికేవాడు కాదు. నేను అక్కడ డబ్బులు కోసం కష్టపడలేదు. ఒక నిండు ప్రాణాన్ని నిలబెట్టాలి అనే దాన్ని సవాల్‌గా తీసుకుని పనిచేశాను. ఆ కష్టం ఫలించడంతో వారిచ్చిన డబ్బుకు నా ముందు విలువ లేదు. ఇలాంటి కేసులు ఎన్నో చేశాను. ఆ తృప్తి కొన్ని వేల రూపాయలు ఇచ్చినా రాదు. ప్రతీ ఒక్కరూ హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకోండి. ఆరోగ్య శ్రీ వచ్చాక ఎన్నో వేల కేసులు తేలికగా వైద్యం చేస్తున్నాం.

–డాక్టర్ రామరాజు,
గుండె వ్యాధి నిపుణులు, కిమ్స్ బొల్లినేని

మాకు దేవుడు ఇచ్చిన అవకాశం



జీవనం సాగించేందుకు ప్రపంచంలో ఎన్నో వృత్తులు, ఉపాధి అవకాశాలు ఉన్నాయి. అయితే ప్రాణాలను కబళించే రోగాలకు దగ్గరగా ఉండే వైద్యులు రోగిని కాపాడేందుకు ఎంతో శ్రమించాల్సి ఉంటుంది. అయితే వైద్య వృత్తి అనేది చాలా పవిత్రమైనదిగా మేము చూస్తాం. ఇది భగవంతుడు మాకు ఇచ్చిన అవకాశం. తమకు వచ్చిన రుగ్మత కారణంగా ఎంతో ఆందోళనతో ఆసుపత్రులకు వచ్చే రోగులు తమ రోగం నయమై ఆరోగ్యంగా తిరిగి వెళుతుంటారు. ఆ సమయంలో వారి కళ్లలో ఆనందం చూసి మేం ఎంతో సంతృప్తి చెందుతాం. ఏ వైద్యుడైనా రోగి ప్రాణాలు కాపాడాలనే చూస్తాడు. రోగి కోలుకున్న సందర్భంలో వైద్యుడు గొప్పవాడు, రోగి విఫలమైన సందర్భంలో వైద్యుడిది తప్పు అన్న భావన ప్రజలు విడనాడాలి.

–డాక్టర్ సురేష్, వద్దాది ఆసుపత్రి, రాజమహేంద్రవరం

శాడిస్టు టెక్కీ

- డ్రగ్స్ మత్తులో భార్యకు నరకం
- స్నేహితులతో కలిసి లైంగిక వేధింపులు
- నిందితుడు కాకినాడ వాసి
- పోలీసులకు బాధితురాలి ఫిర్యాదు

బొమ్మనహళ్లి: ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్త మద్యానికి, డ్రగ్స్‌కు బానిసై భార్యకు నరకం చూపెట్టాడు. ఇంట్లోనే మందు పార్టీలు నిర్వహించి స్నేహితులను భార్యపైకి లైంగికదాడికి ఉసిగొల్పే శాడిస్టు భర్త ఆగడాలపై భార్య పోలీసులను ఆశ్రయించింది. ఈ సంఘటన ఐటీ సిటీ బెంగళూరులో వెలుగుచూసింది.

మ్యాట్రిమోనియల్‌లో పరిచయమై..

బాధితురాలి ఫిర్యాదు, హెచ్ఎస్ఆర్ లేఔట్ పోలీసులు తెలిపిన మేరకు.. ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడకు చెందిన అఖిలేష్ ధర్మరాజ్ 2019లో మ్యాట్రిమోనియల్ వెబ్‌సైట్‌లో బెంగళూరుకు చెందిన ఒక యువతి ప్రొఫైల్‌ను చూసి ఆమెతో పరిచయం పెంచుకున్నాడు. తరువాత ఇద్దరూ ప్రేమించుకుని బెంగళూరు జయనగరలో రిజిస్టర్ పెళ్లితో ఒక్కటయ్యారు. ధర్మరాజ్ ఐటీ ఇంజినీర్ ఉద్యోగం చేసేవాడు, భార్య కూడా అదే ఉద్యోగం చేసేది. పెళ్లయిన కొన్నాళ్లు బాగానే ఉన్న ధర్మరాజ్ తరువాత మద్యంతో పాటు డ్రగ్స్‌కు అలవాటు పడ్డాడు. ఇంటికే డ్రగ్స్ తీసుకువచ్చి సేవించి ఆ మత్తులో భార్యను వేధించేవాడు. తరచూ స్నేహితులను ఇంటికి తీసుకొని వచ్చి మద్యం పార్టీలు చేసుకుంటూ డ్రగ్స్ వాడేవారు. ధర్మరాజ్ ఆ మత్తులో తన స్నేహితులతో కలిసి భార్యను లైంగికంగా వేధించేవాడు.

ప్రైవేటు వీడియోలు తీసి..

ధర్మారజ్ భార్య ప్రైవేట్ వీడియోలను తీసి వాటిని అందరికీ చూపించడంతో పాటు ఇంటర్నెట్లో పోస్ట్ చేస్తానని బెదిరించి, తమకు సహకరించాలని వేధించేవాడు. ఇంట్లోని పడక గదిలో, బాత్‌రూంలో సీసీ కెమెరాలను పెట్టి దృశ్యాలను రికార్డు చేసేవాడు. అతని వేధింపులను తట్టుకోలేక ఆమె పుట్టింటికి వెళితే ఫోన్ చేసి, అక్కడకి వచ్చి నీ వీడియోలు చూపించి గొడవ చేస్తా, లేదంటే చంపేస్తాని బెదిరించి పిలిపించుకునేవాడు. తనతో పాటు తన స్నేహితులకు సహకరించాలని, లేదంటే చంపేస్తానని బెదిరించడంతో తాను మొదట సుబ్రమణ్యపుర పోలీసులకు ఫిర్యాదు చేయగా అక్కడ పట్టించుకోలేదని బాధితులు తెలిపింది. దీంతో ప్రస్తుతం నివాసం ఉంటున్న హెచ్ఎస్ఆర్ లేఔట్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపింది. కేసు నమోదు చేకున్న పోలీసులు విచారణ చేపట్టారు.

ఒంగోలు ఆవుకు రెండు కపిల దూడల జననం



ఆత్రేయపురం: మండల పరిధిలోని పేరవరం గ్రామానికి చెందిన బి.పెద్దిరాజు గోశాలలో ఒంగోలు ఆవుకు రెండు కపిల దూడలు జన్మించాయి. పెయ్య, గిత్త దూడలకు జననం ఇచ్చింది. దీంతో రైతు పెద్దిరాజు ఆనందం వ్యక్తం చేశాడు. అలాగే పరిసర ప్రాంతాల నుంచి రైతులు వచ్చి కపిల దూడలను చూస్తున్నారు.

పేరూరులో షూటింగ్ సందడి



షూటింగ్‌లో పాల్గొన్న నటుడు నాజర్

అమలాపురం రూరల్: పేరూరు పల్లపు వీధిలో సినిమా సందడి నెలకుంది. విశ్వక్‌సేన్ హీరోగా, నేహాశెట్టి హీరోయిన్‌గా నిర్మిస్తున్న వీఎస్11 చిత్రం షూటింగ్ పేరూరులో శరవేగంగా జరుగుతోంది. న్యాయవాది గంటి రామగోపాల్ ఇంటివద్ద చిత్రానికి కృష్ణచైతన్య దర్శకత్వం వహిస్తుండగా సితార ప్రొడక్షన్ సంస్థ నిర్మిస్తోంది. రెండు రోజులుగా జరుగుతున్న సినిమా షూటింగ్‌లో హీరో హీరోయిన్లతో పాటు నటులు నాజర్, హైపర్ ఆది తదితరులు పాల్గొంటున్నారు. మరో రెండు రోజులు షూటింగ్ జరుగుతుంది. ఈ సినిమా కోసం కూరగాయల మార్కెట్. బస్ షెల్టర్ వంటివి ప్రత్యేకంగా సెట్ చేశారు. న్యాయవాది గంటి రామగోపాల్ ఇంటివద్ద షూటింగ్ జరుగుతోంది.

దొంగ అరెస్ట్ : 5 లక్షల సొత్తు స్వాధీనం



పట్టుకున్న చోరీ సొత్తును చూపుతున్న డీఎస్పీ శ్రీనివాసులు, ఇన్‌స్పెక్టర్ గణేష్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఇంటి చోరీలకు పాల్పడే పాత నేరస్తుడిని రాజమహేంద్రవరం రెండో పట్టణ పోలీసులు అరెస్ట్ చేసి అతడి నుంచి రూ.5 లక్షల విలువగల చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నారు. రెండో పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో దక్షిణ మండల డీఎస్పీ కె.శ్రీనివాసులు, ఇన్‌స్పెక్టర్ టి.గణేష్, ఎస్సై జీవీవీ సత్యనారాయణ వివరాలు తెలిపారు. నేరాల దర్యాప్తులో భాగంగా ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు నేరస్తుల కదలికలపై నిఘా పెట్టిన టూటౌన్ పోలీసులకు శుక్రవారం సాయంత్రం తూర్పు రైల్వేస్టేషన్ రోడ్డులో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తి తారసపడ్డాడు. అతడిని ప్రశ్నించగా హైదరాబాద్ రావునగర్‌కు చెందిన పాత నేరస్తుడు చెల్లే జాషువాగా తెలిసింది. అతడిని లోతుగా విచారించగా రాజమహేంద్రవరం 2వ పట్టణ పోలీసు స్టేషన్ పరిధి ఆల్కట్ గార్డెన్స్‌లో గత ఏడాది ఏప్రిల్ నెలలో, ఈ ఏడాది జూన్ నెలలో రెండు ఇళ్లలో బంగారం చోరీ చేసినట్టు అంగీకరించాడు. విజయవాడ, ఇబ్రహీంపట్నం, విశాఖ జిల్లా దువ్వాడ, గోపాలపట్నం, పెందుర్తి, ఎయిర్‌పోర్ట్ స్టేషన్ పరిధిలో పలు నేరాలు చేసినట్టు అంగీకరించాడు. అతడి నుంచి 90 గ్రాముల బంగారం, ఒక ల్యాప్‌టాప్, వెండి పట్టీలు మొత్తం రూ.5లక్షల విలువగల చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు గతంలో రాజమహేంద్రవరం ప్రకాశంనగర్ పోలీసుస్టేషన్ పరిధిలో మొత్తం తొమ్మిది చోరీలు, కడియం, రావులపాలెం, గోపాలపురం పరిధిలో 14 చోరీలు చేసి జైలుకు వెళ్లి వచ్చినట్లు పోలీసులు తెలిపారు. అతడిపై హైదరాబాద్ పోలీసు స్టేషన్లో సస్పెక్ట్ షీట్ ఉందని డీఎస్పీ తెలిపారు. నిందితుడు రైల్వేస్టేషన్‌కు సమీపంలో ఉన్న ఇళ్లను ఎంచుకుని రైలెక్కి వచ్చి చోరీ చేసి తిరిగి రైలులో వెళ్లిపోతుంటాడని డీఎస్పీ తెలిపారు. నిందితుడిని పట్టుకోవడం, చోరీ సొత్తు స్వాధీనం చేసుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఇన్‌స్పెక్టర్ టి.గణేష్, ఎస్సై జీవీవీ సత్యనారాయణ, కానిస్టేబుళ్లు కె.ప్రదీప్‌కుమార్, ఎస్.వీరబాబును అభినందించారు. కానిస్టేబుళ్లకు రివార్డు ఇస్తామన్నారు.

ఎల్‌హెచ్ఎంఎస్ సద్వినియోగం చేసుకోండి

ప్రజలు చోరీల పట్ల అప్రమత్తంగా ఉండాలని అత్యవసర పనిమీద ఊరు వెళ్లాల్సి వస్తే తప్పనిసరిగా అర్బన్ జిల్లా పోలీసులు ఏర్పాటు చేసిన లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టంను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సేవ పూర్తిగా ఉచితమని, గ్రామాంతరం వెళ్లేవారు స్థానిక పోలీసు స్టేషన్లో సమాచారం అందిస్తే పోలీసు సిబ్బంది వచ్చి కెమెరా అమర్చి వెళతారని, తిరిగి ఇంటి యజమాని వచ్చేవరకూ పోలీసుల నిఘాలో ఆ ఇల్లు ఉంటుందని, దీనివల్ల నేరాలు నియంత్రించవచ్చని డీఎస్పీ తెలిపారు.

మెరుగైన ఉద్యోగాలు పొందేలా తర్ఫీదు

- నన్నయ్య యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ పద్మరాజు
- అచ్చంపేట జంక్షన్ వద్ద ఎంఎస్ఎన్ పీజీ సెంటర్ సందర్శన



వీసీ ప్రొఫెసర్ పద్మరాజుకు స్వాగతం పలుకుతున్న అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది

కాకినాడ రూరల్: మెరుగైన ఉద్యోగావకాశాలు పొందేలా విద్యార్థులను తీర్చిదిద్దుతామని ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కె.పద్మరాజు పేర్కొన్నారు. కాకినాడ రూరల్ అచ్చంపేట జంక్షన్ వద్ద నన్నయ్య యూనివర్సిటీ ఎంఎస్ఎన్ పీజీ సెంటర్‌ను తొలిసారిగా శుక్రవారం ఆయన సందర్శించారు. తొలుత క్యాంపస్‌లో ఐ లవ్ ఏ కే ఎన్ యు గుర్తును ఆవిష్కరించారు. క్యాంపస్‌ను పరిశీలించారు. విద్యార్థులకు గల మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. విద్యార్థులు, అధ్యాపకులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకోవడంతో పాటు త్వరలో జరగనున్న అడ్మిషన్లలో ఎక్కువ మంది ఎంఎస్ఎన్ పీజీ సెంటరును ఎంపిక చేసుకునేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కమలకుమారి పీజీ సెంటరులో అందుబాటులో ఉన్న కోర్సులు వివరించి, అధ్యాపకులను పరిచయం చేశారు. ఈ సందర్భంగా వీసీ పద్మరాజు మీడియాతో మాట్లాడుతూ స్థలదాత సత్యలింగ నాయకర్ ఆశయంతో ఎంఎస్ఎన్ క్యాంపస్ వచ్చిందన్నారు. విశాలమైన 50 ఎకరాలు కలిగిన ఈ ప్రాంగణంలో రాబోయే కాలంలో వివిన్న కోర్సులను ప్రారంభించనున్నట్టు తెలిపారు. క్యాంపస్‌లో జాతీయ స్థాయి మౌలిక సదుపాయాలు కలిగిన క్రీడా ప్రాంగణంలో ఇండోర్ స్టేడియం ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. పీజీ సెంటరులో ఎంబీఏ, ఎంసీఏ, ఎంఏ ఇంగ్లీషు, ఎంఏ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఎంఏ ఎకనామిక్స్, ఎంకామ్, ఎంఎస్సీ మ్యాథమెటిక్స్ వంటి కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. 330 సీట్లకు గాను సగం వరకు మాత్రమే భర్తీ అవుతున్నందున ఈ ఏడాది పూర్తి స్థాయిలో భర్తీ కోసం చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా నన్నయ్య పీజీ సెంటరులో విద్యను అభ్యసించే వారికి జగనన్న విద్యాదీవెన వర్తిస్తుందన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ప్రభుత్వరంగ విద్యాసంస్థలో చదివించేందుకు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసరు ప్రశాంతి, డాక్టరు ఎం.పోచయ్య పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ నిషేధం

- రత్నగిరిపై నేటి నుంచే అమలు
- గాజు, కాపర్, స్టీలు బాటిల్స్‌కు అనుమతి




అన్నవరం దేవస్థానం, భక్తులకు కొండపై అమ్ముతున్న గాజు వాటర్ బాటిల్స్

అన్నవరం: రత్నగిరిపై కొలువైన వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో శనివారం నుంచి ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్‌లో మంచినీటి విక్రయాలను నిలిపివేస్తున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానాల తరహా లో గాజు సీసాలు లేదా కాపర్, స్టీల్ సీసాలు మాత్రమే దేవస్థానంలో అనుమతించాలని ఈఓ చంద్రశేఖర్ అజాద్ ఆదేశించారు. నెల రోజుల క్రితమే ఈ మేరకు ఈఓ దేవస్థానంలోని అన్ని షాపులు, క్యాంటీన్ల నిర్వాహకులకు జూన్ 30 వరకు మాత్రమే ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ విక్రయించాలని ఆదేశించారు. కొండపై ప్లాస్టిక్ వాటర్ ప్యాకెట్లు కూడా అనుమతించరు.

మంత్రి ఆదేశాలతో..

ఇప్పటికే దేవస్థానంలో ఒకసారి వాడి పారేసే ప్లాస్టిక్ కవర్లు, ఇతర సామగ్రిని నిషేధించారు. కొండ మీద, కొండ దిగువన దేవస్థానం షాపులలో ఈ నిబంధన కచ్చితంగా అమలు చేయాలని సిబ్బందిని ఈఓ ఆదేశించారు. రత్నగిరి దేవస్థానాన్ని ప్లాస్టిక్ రహిత దేవస్థానంగా మార్చేందుకుగాను దేవదాయశాఖ మంత్రి, కమిషనర్ల ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని ఈఓ తెలిపారు. దేవస్థానం టోల్ గేట్ వద్ద వాహనాల తనిఖీలు చేసేటపుడు ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్‌ను తీసివేయాలని వాహనాల తనిఖీ సిబ్బందిని ఆదేశించారు. రత్నగిరిపై సరాసరిన రోజుకు వేయి వాటర్ బాటిల్స్ విక్రయిస్తున్నారు. కార్తికమాసంలో అయితే రోజుకు మూడు వేలకు పైగా వాటర్ బాటిల్స్ విక్రయిస్తారు. ఏడాదికి సరాసరిన ఐదు లక్షలు వాటర్ బాటిల్స్ కొనుగోలు చేస్తున్నారనేది ఒక అంచనా.

తిరుమలలో గాజు సీసా రూ.60కి విక్రయం

తిరుమలలో ఈ పద్ధతి ప్రవేశపెట్టినపుడు అనేక విమర్శలు వచ్చినా ఇప్పుడు పరిస్థితి మారిందని దేవస్థానం అధికారులు అంటున్నారు. గాజు వాటర్ బాటిల్ లీటర్ రూ.60కి, 750 ఎంఎల్ బాటిల్ రూ.40కి విక్రయిస్తున్నారు. ఇదే పద్ధతి అన్నవరం దేవస్థానంలో కూడా వ్యాపారస్తులు అమలు చేయాలని అధికారులు అంటున్నారు.